AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
25-7-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

అంగన్‌వాడీ అసౌకర్యాల బడి 2





రోడ్డెక్కిన విద్యార్థులు 2

## పీజీ ఎల్ఎల్‌బీ పరీక్ష తేదీ గడువు పొడిగింపు

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఎల్ఎల్‌బీ పరీక్ష తేదీని పొడిగించారు. వివిధ పరీక్షలకు సంబంధించి జూలై 24 నుంచి 30వ తేదీ వరకు గడువు ఉండగా.. జూలై 31 నుంచి ఆగస్టు 14 వరకు పొడిగించినట్లు పరీక్షల నియంత్రణాధికారి సంపత్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ ఎల్.ఎల్.బీ (ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు), ఐఎంబీఏ, ఏపీఈ, ఐపీసీహెచ్ ఐదో సెమిస్టర్, ఏపీఈ, ఐపీసీహెచ్ ఏడో, తొమ్మిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలు వర్తిస్తుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలను తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు.

## ఎరువుల గోదాం తనిఖీ



గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్

**అక్షరటుడే, బోధన్:** ఎడపల్లి మండల కేంద్రంలోని సింగిల్ విండో సొసైటీ గోదాంను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా రైతాంగానికి సరిపడే ఎరువులు యూరియా అందుబాటులో ఉన్నాయన్నారు. ఎవరైనా ఎరువులను అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను ఆదేశించినట్లు తెలిపారు. బోధన్ ప్రాంతం ఆయిల్ పామ్ పంటకు అనుకూలంగా ఉంటుందని.. రైతుల దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ దత్తాత్రి, ఎంపీడీవో శంకర్ నాయక్ ఉన్నారు.




## మహిళలు, పిల్లలకు అండగా భరోసా కేంద్రం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బాధిత మహిళలు, పిల్లలకు అండగా భరోసా కేంద్రం పనిచేస్తుందని సీపీ సాయి చైతన్య తెలిపారు. నిజామాబాద్ సీపీ కార్యాలయ భరోసా కేంద్రంలో నమోదైన పోక్సో, అత్యాచార కేసుల్లో బాధితులకు చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ భరోసా కేంద్రం ద్వారా మహిళలకు మనోధైర్యం, న్యాయం అందించడం పోలీస్ శాఖ ముఖ్య లక్ష్యాల్లో ఒకటని పేర్కొన్నారు. ఆయన వెంట ఏసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, భరోసా సెంటర్ కో-ఆర్డినేటర్ జి.రోజా, లీగల్ అడ్వయిజర్ గీతిక సిబ్బంది తదితరులున్నారు.

జిల్లా విద్యాశాఖలో పలువురు సిబ్బంది తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైసలిస్తేనే గాని పనికావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఏదో ఒక లొసుగును సాకుగా చూపి పనికి అడ్డుపడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు ఐదేళ్లకోసం అనుమతులను రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. దీనిని ఆసరాగా చేసుకుని సిబ్బంది యాజమాన్యాల వద్ద అందినకాడికి దండుకుంటున్నారు. అడిగినంత ఇవ్వకపోతే పని జరగడం లేదు. దీంతో ఏమీ చేయలేక చేతులు తడపాల్సి వస్తున్నట్లు తెలుస్తోంది.

– అక్షరటుడే, ఇందూరు



# పైసలిస్తేనే పర్మిషన్..!

- ప్రైవేటు స్కూళ్ల రెన్యువల్ కోసం చేతులు తడపాల్సిందే..
- డీఈవో కార్యాలయంలో సెక్షన్ అధికారుల తీరు
- సిబ్బంది తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు సుమారు 300కు పైగా ఉంటాయి. ప్రతి స్కూల్ అనుమతిని ఐదేళ్లకోసారి రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. ఇందు కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంబంధిత సెక్షన్ అధికారులు ఉంటారు. మూడు నుంచి ఐదు మండలాలకు కలిపి ఒక సెక్షన్ అధికారిని నియమిస్తారు. ఇలా డీఈవో కార్యాలయంలో సుమారు ఆరుగురు సెక్షన్ అధికారులు ఉన్నారు. తమ మండలాల పరిధిలో అన్ని పత్రాలను సరి చూసి ప్రైమరీ స్కూల్ రెన్యువల్, హైస్కూల్ రెన్యువల్‌ను డైరెక్టరేట్‌కు ఫార్వర్డ్ చేయడం వీరి ప్రధాన విధి.

### సెక్షన్ కోసం పోటీ..

డీఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్లు ప్రైవేటు పాఠశాలల సెక్షన్ కోసం పోటీ పడుతున్నారు. ప్రధానంగా నిజామాబాద్ ఉత్తర మండలం, దక్షిణ మండలం, నిజామాబాద్ రూరల్‌లో ఎక్కువగా ప్రైవేటు పాఠశాలలు ఉంటాయి. ఈ పరిధిలో సెక్షన్ ఉన్నవారికి ఆదాయం ఎక్కువగా ఉంటుందని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కార్యాలయంలోని ఓ జూనియర్ అసిస్టెంట్ ఏకంగా తనకు ఆదాయం ఉన్న సెక్షన్ ఇవ్వాలని బహిరంగంగానే అడిగినట్లు తెలిసింది. డిప్యుటేషన్‌పై కార్యాలయానికి వచ్చిన వారికి ఇచ్చారని.. తనకు మాత్రం ఇవ్వలేదంటూ నిలదీసినట్లు సమాచారం. ఈ ఎపిసోడ్ అంతా డీఈవో దృష్టికి కూడా వెళ్లింది.

### నిబంధనలపై నిక్కచ్చిగా...

డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన అశోక్ నిబంధనల అమలులో నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల నూతన అనుమతులు, అలాగే రెన్యువల్ కోసం వచ్చే వారికి ప్రభుత్వ నిబంధనలు పాటించాలని స్పష్టం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఎటువంటి పత్రాలు లేకున్నా అనుమతులను నిరాకరిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో నూతన అనుమతుల కోసం సుమారు 40 దరఖాస్తులు డీఈవో కార్యాలయానికి అందాయి. అయితే సరైన పత్రాలు లేని కారణంగా డీఈవో వాటిని వెనక్కి పంపించారు. కానీ కొందరు సెక్షన్ అధికారులు మాత్రం అదేమీ పట్టించుకోకుండా ఎంతోకొంత అప్ప చెప్పగానే రెన్యువల్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంతో పోలిస్తే ప్రస్తుతం తమ ఆదాయం తగ్గిందంటూ ఓ అధికారి స్వయంగా మాట్లాడడం చర్చకు దారితీసింది.

### జూనియర్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు..

ఇదిలా ఉంటే డీఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఒకరిపై సహోద్యోగులంతా కలిసి జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌కు ఫిర్యాదు చేశారు. సదరు ఉద్యోగి వ్యవహార శైలిపై కార్యాలయం సిబ్బంది మొత్తం అసహనంతో ఉన్నట్లు తెలిసింది. సదరు ఉద్యోగిని ఏదైనా పాఠశాలకు పంపించాలంటూ డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఈ అంశం టీఎస్జీవోస్ అధ్యక్షుడు సుమన్‌తో పాటు కలెక్టర్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం.

### వసూలు చేస్తే చర్యలు తప్పవు..

ప్రైవేటు పాఠశాలల రెన్యువల్ విద్యాశాఖ నిబంధనల ప్రకారం చేయాలి. అన్ని పత్రాలను నిశితంగా పరిశీలించి రెన్యువల్ చేయాలి. అలాకాకుండా ఎవరైనా వసూళ్లకు పాల్పడి నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. – అశోక్, డీఈవో





## అర్హులందరికీ రేషన్ కార్డులు

**అక్షరటుడే, బోధన్:** అర్హులందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బోధన్ మండలం సాలూరలో లబ్ధిదారులకు శుక్రవారం రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోందన్నారు. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందిస్తామని స్పష్టం చేశారు. బోధన్ నియోజకవర్గానికి 6,600 రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఇంకా ఎవరైనా అర్హత ఉన్నా కార్డులు రాని వారు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మాహతో, సివిల్ సప్లయ్స్ జిల్లా అధికారి తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

**అక్షరటుడే ఇందల్వాయి:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేఎన్ఆర్ గార్డెన్‌లో శుక్రవారం లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో లబ్ధిదారులకు ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 3,200 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందించినట్లు వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వెళ్తున్నామన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం 40 లక్షల రేషన్‌కార్డులను మంజూరు చేసిందని భూపతి రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి తన ధ్యేయమని కార్యకర్తల కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# దళిత వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

- బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు దళితబంధు అమలు చేశాం
- అంబేద్కర్ పేరును సెక్రటేరియట్‌కు పెట్టాం
- బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



లింగంపేటలో నిర్వహించిన ఆత్మగౌరవ గర్జన సభలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**అక్షరటుడే, లింగంపేట:** రాష్ట్రంలో దళితులకు వ్యతిరేకంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని త్వరలోనే గద్దెదించుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. లింగంపేటలో శుక్రవారం నిర్వహించిన దళితుల ఆత్మగౌరవ గర్జన సభలో ఆయన మాట్లాడారు. దళితుల పట్ల రేవంత్ ప్రభుత్వం అమానవీయంగా ప్రవర్తిస్తోందని మండిపడ్డారు. లింగంపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఇటీవల మాజీ ఎమ్మెల్యే జాజాల ఫొటోతో ఫ్లెక్సీ పెట్టిన మాజీ ఎంపీపీ సాయిలుకు పోలీసులు చేసిన అవమానం క్షమించరానిదన్నారు. ప్రభుత్వం అండ చూసుకునే వారు అలా ప్రవర్తించారన్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకు లింగంపేటకు వచ్చానని.. ఆనాడు జరిగిన ఘటనకు బద్లా తీసుకుంటామని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సాయిలును సభలో సన్మానించారు. అంబేద్కర్ సూత్రాలను స్ఫూర్తిగా తీసుకుని కేసీఆర్ 14 ఏళ్లు పోరాడితే తెలంగాణ సాధ్యమైందని కేటీఆర్ అన్నారు. అంబేద్కర్‌ను చూసి ప్రతిఒక్కరూ స్ఫూర్తిపొందేలా.. హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. అంబేద్కర్ పేరును సెక్రటేరియట్‌కు పెట్టుకున్నామని.. ఇలా ఏ రాష్ట్రంలోనూ జరగలేదన్నారు. రాష్ట్రంలో ఉన్న 18 శాతం దళిత జనాభాకు న్యాయం చేయాలని ఉద్దేశంతో దళితబంధును కేసీఆర్ ప్రభుత్వం దశలవారీగా అమలు చేసిందని వివరించారు.

మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ.. దళితులు కష్టపడి ఇళ్లు కట్టుకుంటే ఇక్కడ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఓర్వలేకపోతున్నాడని ఆరోపించారు. దళితుడైన జేసీబీ డ్రైవర్ ఒక్కో రూపాయి కూడబెట్టి ఇల్లు కట్టుకుంటే నిర్దాక్షిణ్యంగా కూల్చేశారన్నారు. నియోజకవర్గంలో దళితులను అవమానిస్తున్నారని ఆరోపిస్తున్నారు. డయేరియాతో తండ్రీకొడుకులు మృతి చెందితే కాంగ్రెస్ నాయకులు ఒక్కరు కూడా కనీసం పరామర్శించలేదన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉన్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సభలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, హన్మంత్ షిండే, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్మన్ దఫేదార్ రాజు పాల్గొన్నారు.

## పీసీసీ చీఫ్ ఇంటిని ముట్టడించిన విద్యార్థి సంఘాలు

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను వెంట నే పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌతం కుమార్, రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఇంటిని శుక్రవారం ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. మౌలిక సదుపాయాలు లేక ప్రభుత్వ పాఠశాలలు డేంజర్ జోన్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్స్ బకాయిలు పేరుకుపోయాయన్నారు. కాగా విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అడ్డుకొని నాలుగో టౌన్‌కు తరలించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కార్తీక్, ప్రిన్స్, ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు రాజశేఖర్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు మనోజ్, సాయినాథ్, రాహుల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.





ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

## మెడికల్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీస్ ఇవ్వండి

**అక్షరటుడే, కామారెడ్డి:** రామారెడ్డి మెడికల్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ డీఎంహెచ్‌వోను ఆదేశించారు. రామారెడ్డి పీహెచ్‌సీని శుక్రవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సమయంలో వైద్యాధికారి డాక్టర్ సురేష్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారికి షోకాజ్ ఇవ్వాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌ను ఆదేశించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అలాగే పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

## తెలంగాణలో టీడీపీ జెండా పాతాలని కుట్ర : దేశపతి



తాను సీఎంగా ఉన్నన్ని రోజులు రాష్ట్రంలో సిని మా టికెట్ ధరలు పెంచే ప్రసక్తే లేదని పేర్కొన్న రేవంత్‌రెడ్డి హరిహర వీరమల్లు సినిమాకు రేట్లు ఎలా పెంచారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేశపతి శ్రీనివాస్ ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, మోదీ మధ్య ఒక బంధం నడుస్తోందని వ్యాఖ్యానించారు. అందుకే ధరలు పెంచారన్నారు. తెలంగాణలో టీడీపీ మరోసారి జెండా పాతాలనే కుట్ర సాగుతోందని విమర్శించారు. అందులో భాగంగానే వేల మంది బీఆర్ఎస్ నేతలపై కేసులు పెడుతున్నారని విమర్శించారు.

## శ్రావణ శోభ

శివకేశవులకు ప్రీతికరమైన శ్రావణ మాసం ప్రారంభమైంది. శుక్రవారం తొలిరోజు ఆలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు వచ్చి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

–అక్షరటుడే, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్



# హోటళ్లను తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్..



**అక్షరటుడే, బోధన్:** హోటళ్లలో పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ జాదవ్ సూచించారు. ఈ మేరకు పట్టణంలోని పలు హోటళ్లతో పాటు టిఫిన్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హోటళ్లలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా నాణ్యత లోపిస్తే మాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. అదేవిధంగా పలుచోట్ల పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో నీరు నిల్వ ఉండకుండా చూడాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. అలాగే పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని చెప్పారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, నిజాంసాగర్:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శి భీమ్ రావు సూచించారు. నిజాంసాగర్ మండల కేంద్రంలో ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శితో పాటు ఆరోగ్య కార్యకర్తలు ఫర్జానా, సునీతతో కలిసి కాలనీల్లో పర్యటించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. పైప్ లైన్ లీకేజీలను పరిశీలించారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని ముచ్కూర్ గ్రామంలో నివాసముండే పప్పుల బాలరాజు ఇటీవల అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అనంతరం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా.. మంజూరైన చెక్కును శుక్రవారం కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం మండల అధ్యక్షుడు కొరాడి రాజు, మురారి అందజేశారు. ఈ సందర్భంగా చెక్ మంజూరు కోసం సహకరించిన బాల్కొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కొరాడి లింబాద్రి, బాయికాడి రాజు, బద్దం అవినాష్, శ్రీధర్ గౌడ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి సంరక్షించాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా వార్డు నంబర్ 3, 4వ వార్డుల్లో ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. అదే విధంగా 100 రోజుల కార్యాచరణలో భాగంగా వార్డు 12, 29 వార్డులో డ్రెయినేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు సూచించారు. పెర్కిట్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను సందర్శించి రోగుల వివరాలు, మందుల లభ్యతపై మెడికల్ ఆఫీసర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాలు అసౌకర్యాలకు నెలవుగా మారాయి. సెంటర్లలో కనీస సౌకర్యాలు కరువవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా పలుచోట్ల టీచర్లు అందుబాటులో లేకపోవడం.. మరికొన్ని చోట్ల సరుకులను పక్కదారి పట్టిస్తుండడంతో క్షేత్రస్థాయిలో విద్యార్థులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.**

**- అక్షరటుడే, భీమ్‌గల్**

# అంగన్‌వాడీ.. అసౌకర్యాల బడి



బెజ్జోరలోని ఓ అంగన్వాడీ కేంద్రం ఎదుట సీసీ రోడ్డుపై భోజనాలు చేస్తున్న చిన్నారులు

- అద్దె గదులు, శిథిల భవనాల్లో కేంద్రాలు
- అందుబాటులో ఉండని టీచర్లు
- విద్యార్థుల హాజరుశాతం అంతంత మాత్రమే..
- క్షేత్రస్థాయిలో అందని పౌష్టికాహారం
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

జిల్లాలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ రూరల్, భీమ్‌గల్ ప్రాజెక్టుల్లో మొత్తం 1,500 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఆయా ప్రాజెక్టుల పరిధిలోని కేంద్రాల్లో 1,06,234 మంది చిన్నారులున్నారు. అయితే కేంద్రాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వీరికి క్షేత్రస్థాయిలో పౌష్టికాహారం సరిగ్గా అందడం లేదనే ఆరోపణలున్నాయి.

## అధ్వానంగా నిర్వహణ

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అధ్వానంగా మారింది. జిల్లాకు మారుమూల ఉన్న భీమ్‌గల్ మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు లేరు. గత కొన్నేళ్లుగా గతేడాది విద్యార్థుల పేర్లతో కేంద్రాలను కొనసాగిస్తున్నారు. అలాగే చిన్నారులున్న కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు సరిగ్గా రావడం లేదని ఆరోపణలున్నాయి. ఆయాలే టీచర్లుగా కొనసాగుతున్నారు. వారానికి ఓసారి వచ్చి టీచరు హాజరు వేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. మరికొన్ని కేంద్రాల్లో కేవలం ఒక చిన్న గదిని అద్దెకు తీసుకుని రోడ్డుపై చిన్నారులను కూర్చోబెట్టి చదువు చెబుతున్నారు. వారికి పౌష్టికాహారం సైతం రోడ్డుమీదే అందిస్తున్నారు. అంతేకాకుండా పలుచోట్ల పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టిస్తున్నారని చిన్నారుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

## అద్దె గదుల్లో కేంద్రాలు

జిల్లాలో అనేక చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పలుచోట్ల ఇరుకు గదులు, శిథిలావస్థకు చేరిన భవనాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భీమ్‌గల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 283 కేంద్రాలున్నాయి. అందులో కేవలం 263 కేంద్రాల్లో ఉపాధ్యాయులున్నారు. 106 కేంద్రాలకు సొంత భవనాలున్నాయి. 177 కేంద్రాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

## పర్యవేక్షణ కరువు..

గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలనేది సర్కారు లక్ష్యం. ప్రీస్కూల్ ఎడ్యుకేషన్, పౌష్టికాహారం, ఆరోగ్య పరీక్షలు చేయించడం వంటి కార్యక్రమాలు అంగన్‌వాడీ పరిధిలోనే ఉంటాయి. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి పుట్టిన బిడ్డకు ఐదేళ్లు నిండే వరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తుంది. అలాగే వారి ఆరోగ్య సంరక్షణ బాధ్యత కూడా అంగన్‌వాడీ కేంద్రాలదే. అయితే అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేకపోవడంతో సత్ఫలితాలు అందడం లేదనే చర్చ వినిపిస్తోంది. కేవలం వారోత్సవాలు, ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసే సమయంలో తప్ప అధికారులు మిగతా టైంలో క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని, పరిశీలనలు, తనిఖీలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. భీమ్‌గల్ పరిధిలో మొత్తం 11 సెక్టార్లున్నాయి. 11 మంది పర్యవేక్షకులు ఉండాలి. కేవలం ఒకరు మాత్రమే ఉన్నారు.

### పర్యవేక్షకులు లేక ఇబ్బందులు

భీమ్‌గల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం 11 సెక్టార్లున్నాయి. 11 మంది పర్యవేక్షకులు ఉండాలి. కేవలం ఒకరు మాత్రమే ఉన్నారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటాం. **– స్వర్ణలత, సీడీపీవో**

# ఆహార భద్రత కార్డుల పంపిణీ



**అక్షరటుడే, నిజాంసాగర్:** నూతన ఆహార భద్రత కార్డులను కొడప్‌గల్ గ్రామ పంచాయతీలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ఛైర్మన్ నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ గులామ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# బీర్కూర్ తహశీల్దార్‌గా భుజంగరావు బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ తహశీల్దార్‌గా భుజంగరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన లత బదిలీపై ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయ డీఏవోగా వెళ్లారు. ఎల్లారెడ్డి తహశీల్దార్‌గా పనిచేసిన భుజంగరావు బదిలీపై బీర్కూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

**అక్షరటుడే, కామారెడ్డి:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు రోడ్డెక్కారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు కొత్త బస్టాండ్ నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. చౌరస్తాలో ఒక వైపు రహదారిని దిగ్బంధించి బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సుమారు 20 నిమిషాల పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు రూ.8,300 కోట్లు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం విద్యార్థులపై నిర్లక్ష్యం వహించడంతో బకాయిలు పెరిగిపోయాయని తెలిపారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని, నిధులు విడుదల చేస్తామని చెప్పినా ఇప్పటికీ దానిపై మాట్లాడడం లేదన్నారు. బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు నిలిచిపోవడంతో విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు వెనుకంజ వేస్తున్నాయన్నారు. ఫలితంగా ఉన్నత చదువులు చదివిన విద్యార్థులు పైస్థాయికి వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇకనైనా పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థులందరితో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.



# బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

**అక్షరటుడే నిజాంసాగర్:** విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్ నోడల్ ఆఫీసర్ షేక్ సలాం అన్నారు. నిజాంసాగర్, పిట్లం ప్రభుత్వ జూనియర్ కళాశాలలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిజాంసాగర్ జూనియర్ కళాశాలలో లెక్చరర్లతో సమావేశమయ్యారు. విద్యార్థుల హాజరు శాతాన్నిపెంచాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదివి కళాశాలకు మంచిపేరు తేవాలని సూచించారు. అనంతరం పిట్లం జూనియర్ కళాశాలలో తరగతులకు విద్యార్థులతో పాటు హాజరయ్యారు. నూతన ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టిన విజయ్ శేఖర్‌ను అభినందించారు.



# గడ్డి కోస్తుండగా తెగిన విద్యుత్ వైర్లు.. కరెంట్ షాక్‌తో రైతు మృతి

**అక్షరటుడే, భీమ్‌గల్:** పొలంలో గడ్డి కోస్తుండగా విద్యుత్ తీగలు తెగి కరెంట్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన భీమ్‌గల్ మండలంలో చోటు చేసుకుంది. భీమ్‌గల్ ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రహత్ నగర్ గ్రామానికి చెందిన రైతు ధరావత్ రామ్ సింగ్(50) రోజూ మాదిరిగానే శుక్రవారం తన పొలంలో పనులు చేసేందుకు వెళ్లాడు. కాగా.. పొలంలో ఒడ్డు వెంట గడ్డి కోసే సమయంలో పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. పక్కనే పొలం దున్నుతున్న మరో రైతు గమనించి దగ్గరికి వెళ్లి చూడగా అప్పటికే అతడు మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహానికి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. తమ ఇంటికి పెద్దదిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది.

# రెడీమిక్స్ ప్లాంట్‌లో దొంగల హల్‌చల్.. నైట్‌వాచ్‌మెన్లపై దాడి

**అక్షరటుడే, భిక్కనూరు:** మండల కేంద్రం శివారులో ఉన్న రెడీమిక్స్ ప్లాంట్‌లో దొంగలు హల్‌చల్ చేశారు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు టోల్‌ప్లాజా సమీపంలో రెడీమిక్స్ ప్లాంట్ ఉంది. టోల్‌ప్లాజా భవనాల నిర్మాణాల నిమిత్తం రెడీమిక్స్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయగా దీనికి ఇద్దరు వ్యక్తులు నైట్‌వాచ్‌మెన్లుగా ఉన్నారు. తెల్లవారుజామున దుండగులు ఆటోలో వచ్చి అక్కడి పైప్‌లు దొంగలిస్తుండగా నైట్ వాచ్‌మెన్లు అడ్డుకున్నారు. దీంతో వారిపై దుండగులు దాడిచేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.






# రేపు బనకచర్లపై బీఆర్ఎస్‌వీ రాష్ట్ర సదస్సు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** బనకచర్ల ప్రాజెక్ట్ కారణంగా తెలంగాణకు జరిగే అన్యాయంపై శనివారం రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్‌వీ ప్రధాన కార్యదర్శి మధుకర్ రెడ్డి తెలిపారు. నగరంలోని సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి కళాశాలలో బనకచర్ల ప్రాజెక్ట్ కారణంగా తెలంగాణకు జరిగే నష్టాన్ని వివరించాలనే ఉద్దేశంతో కరపత్రాలను ఆవిష్కరించామన్నారు. సదస్సుకు విద్యార్థులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నవాకిశోర్, భాస్కర్, నితిన్, శశాంక్, చింటూ తదితరులు పాల్గొన్నారు.




# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటివైద్యశిబిరం

**అక్షరటుడే, నిజాంసాగర్:** పిట్లం మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. క్యాంప్‌లో ఆప్తాల్మిక్ అసిస్టెంట్ హరికిషన్ రావు ఆధ్వర్యంలో 55 మందికి పరీక్షలు చేశారు. అందులో తొమ్మది మందిని బోధన్ కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఒకరిని హైదరాబాద్ సరోజిని కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కిషన్, కార్యదర్శి బాలు, కోశాధికారి మారుతిరెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**అక్షరటుడే, నిజాంసాగర్:** పిట్లం మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో, పార్వతి దేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా మహిళలు కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.